క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.11 లక్షల విరాళం



దాత రామారెడ్డికి బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎన్ఏడీ కొత్తరోడ్డు సమీపం, పాత కరాసకు చెందిన బోర తారకరామారెడ్డి లక్ష 11వేల 111 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పి.నరసింగరావు బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.

ఘనంగా ఏకాదశి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సింహగిరిపై మదనగోపాల స్వామికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేప చేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

స్విమ్మింగ్‌లో విస్తం విద్యార్థి ప్రతిభ



వెంకటసాయిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: విశాఖ మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరు, మంగళగిరిలలో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బి.వెంకటసాయి స్వర్ణ పతకాలు సాధించాడు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వెంకటసాయిని కళాశాల ఎండీ మళ్ల అనూష, హెచ్‌వోడీ నోయల్, ఏవో సాయిరాంనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు ప్రత్యేకంగా అభినందించారు.

సెపక్ తక్రా రాష్ట్ర జట్టుకు శ్వేతాశ్రీ



శ్వేతాశ్రీని అభినందిస్తున్న సీహెచ్ మహంతి, కళాశాల సిబ్బంది

సబ్బవరం: మండలంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి నునబర్తి శ్వేతాశ్రీ జాతీయ జూనియర్ సెపక్ తక్రా చాంపియన్‌షిప్–2025లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన 29వ ఏపీ జూనియర్ అంతర్ జిల్లాల సెపక్ తక్రా పోటీల్లో అనకాపల్లి జట్టుకు ప్రాతినిధ్యం వహించి, అద్భుత ప్రతిభ కనబరిచింది. దీంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికై జాతీయ పోటీల్లో పాల్గొననుంది. ఈ పోటీలు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 వరకూ పంజాబ్‌లో జరగనున్నాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు అభినందించారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి



కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నాయకులు

అగనంపూడి: ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలకు 85వ వార్డు గొన్నవానిపాలెంలో అగనంపూడికి చెందిన కాపునాడు నాయకులు నివాళులర్పించారు. తెలుగు భాషలందు తెలుగు లెస్స అని కొనియాడిన కవి పోషకుడు, తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహారాజు శ్రీకృష్ణదేవరాలయలని నాయకులు తెలిపారు. గొన్నా హేమంత్, బలిరెడ్డి సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, గొన్న రమణ పాల్గొన్నారు.

బతుకుల్లో ఎన్టీపీసీ బూడిద



ఎన్టీపీసీ కాలుష్యంలో మూలస్వయంభూవరం

సింహాద్రి ఎన్టీపీసీ చిమ్నీలు, కూలింగ్ టవర్లు విడుదల చేసే కాలుష్యం, వ్యర్థ రసాయన జలాలతో కలపాక శివారు మూలస్వయంభూవరం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగిరి పడుతున్న ఉప్పునీటి తుంపర్లతో గృహాలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయోనని భయపడుతున్నారు. దీంతో 2024 ఎన్నికల బహిష్కరణకు సిద్ధపడిన గ్రామ ప్రజల్ని.. తనను గెలిపిస్తే గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపడతానని పంచకర్ల హామీ ఇచ్చారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

ఫార్మా కాలుష్యంతో అనారోగ్యం



ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో తాడి గ్రామం

ఫార్మాసిటీ ఔషధ పరిశ్రమల కాలుష్యంలో చిక్కుకొన్న పెద తాడి, చినతాడి, తాడి కాలనీల ప్రజల్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదు. ఇక్కడి పరిశ్రమల విషవాయువులతో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాద ఘటనలతో హడలిపోతున్నారు. మే నెల్లో కంటి తుడుపు చర్యగా సర్వే నిర్వహించి చేతులు దులిపేసుకున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి ఇదే జరుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

కలగానే డిగ్రీ కళాశాల



పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

పరవాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు హామీ కలగానే మిగిలిపోయింది. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై ఆధారపడాల్సి వస్తోంది. కేవలం ఆర్థిక స్థోమత ఉన్నవాళ్లే పై చదువులకు వెళ్లగలుగుతున్నారు. పేద విద్యార్థులు అందుబాటులో డిగ్రీ కళాశాల్లేక చదువులు అర్థంతరంగా ఆపేస్తున్నారు.

మినీ జెట్టీ.. ఉత్తిమాటే..!



ముత్యాలమ్మపాలెం తీరంలో పడవలు

చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలరీపేట గంగపుత్రులకు అవసరమైన మినీ జెట్టీ నిర్మిస్తామన్న హామీ.. ఏడాదిన్నరవుతున్నా కనీసం ప్రతిపాదనలకూ నోచుకోలేదు. బోట్లను నిలపడానికి తీరంలో సరైన వసతుల్లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

హామీలు గుప్పించి.. ప్రజల్ని ఏమార్చి..!

ఏడాదిన్నర సమీపిస్తున్నా.. హామీల అమలు శూన్యం

కాలుష్య నియంత్రణ, మినీ జెట్టీ, డిగ్రీ కళాశాల ఊసేలేదు

మూలస్వయంభూవరం, తాడి, ముత్యాలమ్మపాలెం వాసుల ఆవేదన

ఎన్నికల సమయంలో మా గ్రామాలకు అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ హామీలు గుప్పించారు. ఎన్టీపీసీ, ఫార్మా కాలుష్య కోరల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. డిగ్రీ కళాశాలను తీసుకొస్తామన్నారు. మినీ జెట్టీ నిర్మించి గంగపుత్రుల బెంగ తీరుస్తామన్నారు. తీరా ఓట్లేసి ఎన్నికల్లో గెలిపించాక హామీలను పక్కన పెట్టి పత్తాలేకుండా పోతున్నారని పరవాడ మండలంలోని కలపాక శివారు మూలస్వయంభూవరం, తాడి, ముత్యాలమ్మపాలెం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరవాడ: సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన పంచకర్ల రమేష్‌బాబు మండల ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించారు. ప్రధానంగా ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకున్న కలపాక శివారు మూలస్వయంభూవరం, ఫార్మాసిటీ పరిశ్రమల కాలుష్యంతో సతమతమవుతున్న తాడి గ్రామాలను సురక్షిత ప్రదేశాలకు తరలింపు, పరవాడ ప్రాంత విద్యార్థులకు వీలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, ముత్యాలమ్మపాలెం మత్స్యకారుల సౌకర్యార్థం తీరంలో జెట్టీ నిర్మించే పూచీ తనదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర సమీపిస్తోంది. ఆయనిచ్చిన హామీల అమలు ఊసేలేదని ఆయా గ్రామాల ప్రజల నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉంది.



తీరంలో నిలిపిన పడవలు

వ్యాధులతో అవస్థలు



ఎన్టీపీసీ కాలుష్యంతో గ్రామంలో చస్తూ బతుకుతున్నాం. ఇళ్లు బీటలు వారుతున్నాయి. భూగర్భ జలాలు తాగేందుకు పనికి రాని పరిస్థితి. అనేక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నాం. ఎమ్మెల్యే పంచకర్ల ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

– తుంపాల అప్పారావు, మూలస్వయంభూవరం

జెట్టీ నిర్మాణమెప్పుడు?

తరచూ వస్తున్న తుపాన్లతో పడవలకు రక్షణ లేకుండా పోతోంది. తీరంలో కనీస సదుపాయలు లేవు. ఇసుక మేటలో నిలిపిన పడవలు భారీ అలల తాకిడికి కొట్టుకుపోతున్నాయి. తీరంలో మినీ జెట్టి ఏర్పాటు హామీ అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– వాసుపల్లి కొర్లయ్య, ముత్యాలమ్మపాలెం

తాడి తరలింపు సందేహమే?



ఎన్నికల్లో హామీలివ్వడం తప్ప అమలు ప్రయత్నాలు కనిపించట్లేదు. గత 15 ఏళ్లుగా గ్రామాన్ని తరలిస్తారని ఎదురు చూస్తున్నాం. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా తాడి గ్రామ తరలింపు అనుమానమే.

– కర్రి లక్ష్మి, తాడి కాలనీ

డిగ్రీ కళాశాల ఎప్పుడు?



పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చాలా అవసరం. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ చదువుల కోసం నగరంలోని కళాశాలలపై ఆధారపడాల్సి వస్తోంది. తక్షణమే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలి.

– బండారు రాజు, పరవాడ

'సాక్షి'పై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు ఆక్షేపణీయం



తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

సబ్బవరం: సమాజంలోని మంచి చెడులను చూపిస్తూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా నిలిచే పత్రికా విలేకర్లు, సంపాదకులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని మండలంలోని పాత్రికేయులు నిరసన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు మండలంలోని పలు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హల్‌చల్ చేసిన నకిలీ మద్యం వ్యవహారంపై సాక్షిలో వచ్చిన కథనాలపై ప్రభుత్వ స్పందన సరికాదన్నారు. ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు రిపోర్టర్లను వేధించేలా కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయమన్నారు. ఇకనైనా ఇలాంటి చర్యల్ని ప్రభుత్వం విడనాడాలని హితవుపలికారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినవారిలో సీనియర్ పాత్రికేయులు బాబ్జీ, ఆరిపాక ప్రసాద్, సబ్బవరపు నాగేంద్ర, సత్యనారాయణ, నాయుడు, ఎస్.నాగేష్ తదితరులు ఉన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం వైభవంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. స్వామిని మొక్కుకుని కోరిన కోర్కెలు తీరిన పలువురు భక్తులు తులాభారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. డిప్యూటీ ఈవో రాధ, సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.

ఘనంగా మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు

సబ్బవరం: గ్రామీణ ప్రాంత విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల, డివిజన్ తదితర స్థాయిల్లో నిర్వహించనున్న పోటీల్లో ప్రతిభ చూపాలని అభిలషించారు. ఈ పోటీల్లో మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు పోటీల కోఆర్డినేటర్ రెహమాన్ తెలిపారు. పలు పాఠశాలల నుంచి వచ్చే బాలికలకు శనివారం పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్ర బాబు, ఉప సర్పంచ్ వనం దేముడుతో పాటు పలు పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కొండపోరంబోకు స్థలాల్లో ఆక్రమణలపై చర్యలు



అసకపల్లిలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, తదితరులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం.1లోని కొండ పోరంబోకు భూమిని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ భూమిలో కొత్తగా పలు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు పొక్లెయిన్ సాయంతో తొలగించనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ పోల్స్ వేసిన వారిపై, రేకుల షెడ్‌లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులను తొలిగించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సర్వే నెం.16లో చెరువు పోరంబోకు స్థలంలో కూడా ఆక్రమణలు గుర్తించామని, బాధ్యులపై క్రిమినల్, భూ ఆక్రమణ కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ వీరయ్య, సిబ్బంది ఉన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి నిందితుడిని శిక్షించాలి



తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సబ్బవరం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై బూటు విసిరి దాడికి పాల్పడ్డ సీనియర్ న్యాయవాది రాకేష్‌పై కేసు నమోదు చేయాలని మండలంలోని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకులు దువ్వి దుర్గాలు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. న్యాయవాది రాకేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇండుగబల్లి గోపి, నీటిపల్లి ముత్యాలరావు, మారెడుబూడి కోటి, నీటిపల్లి కొండబాబు, మధు, బొర్రా జయరాజు తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో బెల్ట్ దుకాణంలో పట్టుబడిన మద్యం



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసులు

పెందుర్తి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందన్నారు. శుక్రవారం స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాలకు పాల్పడేది ఎంతటివారైనా విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. జనావాసాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు అందించాలని ప్రజలకు సూచించారు. కాలనీలో సరైన పత్రాలు లేని 12 వాహనాలను సీజ్ చేశారు. ఇంట్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తి నుంచి 5 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, అతడ్ని అదుపులోనికి తీసుకున్నారు. ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోను యథావిధిగా కొనసాగించాలి



లేఖతో ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెంలోని ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోను యథావిధిగా కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీకి లేఖ అందజేశారు. స్టీల్ సిటీ డిపో వల్ల కూర్మన్నపాలెం, స్టీల్ ప్లాంట్ పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సదుపాయం ఎంతగానో మెరుగుపడిందన్నారు. విద్యార్థులకు, వివిధ అవసరాల నేపథ్యంలో నగరంతోపాటు సమీప ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారికి మేలు జరిగిందన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్టీల్ సిటీ డిపో గడువు లీజును పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆర్.రావు, జిల్లా కార్యదర్శి పిల్లా శంకరరావు, జిల్లా అధ్యక్షుడు పి.ఎస్. మూర్తి, నాయకులు ఎ.కె. శివాజీ, వి.ఎస్.ఆర్. మూర్తి, బి.ఎం. రావు, కె.సీహెచ్. బాబు, బి.కె. రాజు, పి.ఎస్. రావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నపాలెం లక్ష్మి బార్‌పై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ సరోజాదేవి

పెందుర్తి: ఉదయం నిర్దేశిత సమయం కంటే ముందే బార్ తెరిచి అమ్మకాలు సాగిస్తున్న వేపగుంట దరి అప్పన్నపాలెంలోని లక్ష్మి బార్‌పై కేసు నమోదు చేసినట్లు పెందుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సరోజాదేవి తెలిపారు. శుక్రవారం నాయుడు తోటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటల్లోపే బార్ తెరిచినట్లు తమకు సమాచారం రావడంతో తక్షణమే పరిశీలించామన్నారు. నిర్దేశిత సమయం కంటే ముందే తెరిచినట్లు ప్రాథమిక ఆధారాలు ఉండడంతో బార్‌పై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు బెల్ట్ దుకాణంలో అమ్మకానికి 10 మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఓ వ్యక్తిని లక్ష్మీపురం కూడలి వద్ద అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. బెల్ట్ దుకాణాలు నిర్వహించినా, నిర్దేశించిన వేళలు పాటించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అనుమతి లేని బాణసంచా స్వాధీనం



పట్టుబడిన బాణసంచా, నిందితులతో పెందుర్తి సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: దీపావళి అమ్మకాల కోసం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవరజగ్గయ్యపాలెంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేశారు. వివరాలివి.. గ్రామానికి చెందిన బొడ్డేటి వినోద్ దాదాపు రూ.30 వేలు విలువైన మందుగుండు సామాగ్రిని ఇంట్లో ఉంచాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. అనుమతి లేని బాణసంచాతో పాటు నిందితుడు వినోద్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింహాచలం పాత గోశాల వద్దనున్న శ్రీనివాస్‌నగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట శిబిరంపై పెందుర్తి పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.9,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు.